నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 మంగళవారం 26 నవంబర్ 2024 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

### శైలజపైనే మాకు ఆశలు ఉండేవి



మా మేన కోడలు శైలజ చదువులో చురుకుగా ఉండేది. శైలజ తండ్రి తుకారం తనకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివిస్తున్నాడు. శైలజ ఉన్నత చదువులు చదువుకొని తప్పకుండా మంచి స్థాయికి వెళ్తుందని ఎంతో ఆశపడ్డారు. కానీ చివరికి ఇలా అయ్యింది. ఆమె చనిపోతుందని అస్సలు అనుకోలేదు.

**- నాందేవ్, శైలజ మేనమామ**

### ప్రాణాలతో తిరిగి వస్తుందనుకున్నం



మా తమ్ముడి కూతురు శైలజ ప్రాణాలతోనే తిరిగి వస్తుందనుకొని ఎంతో ఆశ పడ్డం. హైదరాబాద్‌లోని పెద్ద దవాఖానలో చేర్పించిన్రు అన్నరు. ఏం కాదనుకున్నం. కానీ చివరికి మా బిడ్డ శవాన్ని అప్పగిస్తరనుకోలేదు. మా బిడ్డ చావుకు అధికారులే బాధ్యత వహించాలి. మా ఇంటికి పెద్దదైన శైలజపై మేము ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. చివరికి మరణవార్త వినాల్సి వచ్చింది.

**- వడాయి కన్ను, శైలజ పెద్దనాన్న**



*ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే మడావి గంగోత్రి(14) వాంతులు, విరేచనాలు చేసుకుని మృతి చెందింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చూపించి వైద్యుల సూచనల మేరకు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. కాగా.. గంగోత్రి పాఠశాల బాత్‌రూమ్‌లోనే స్పృహతప్పి పడిపోయి చనిపోయిందని.. పాఠశాల సిబ్బంది పట్టించుకోకపోతే ఆమె మృతి చెందేది కాదంటూ వారి కుటుంబ సభ్యులు ఆరోపించారు.*

***- ఈ ఘటన అక్టోబర్ 26, 2024న జరిగింది.***

# ఆశ్రమాల్లో మృత్యుఘోష

## ఫుడ్ పాయిజన్‌తో వాంకిడి విద్యార్థిని మృతి

- నిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- 20 రోజులుగా మృత్యువుతో పోరాడి ఓడిన శైలజ
- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు
- అధికారుల నిర్లక్ష్యమేనంటూ మండిపాటు
- ప్రాణాలతో తిరిగొస్తుందనుకున్నాం : బంధువులు





● రాలిన విద్యాకుసుమం

హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందిన శైలజ, (ఇన్‌సెట్లో) శైలజ (ఫైల్)

***బంగారు భవిష్యత్ కోసం ఎన్నో కలలు కన్న విద్యాకుసుమం అర్ధాంతరంగా తనువు చాలించింది. ఫుడ్ పాయిజన్‌తో దవాఖాన పాలైన ఆ బాలిక మృత్యువుతో పోరాడుతూ చివరకు ఓడిపోయింది. ఉన్నత చదువులు చదివి తమకు అండగా నిలుస్తుందనుకొని ఆశపడ్డ ఆమె తల్లిదండ్రులకు చివరకు దు:ఖమే మిగిలింది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ నిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఊపిరి వదలగా, స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. అధికారుల నిర్లక్ష్యమే నిండుప్రాణాన్ని బలిగొన్నదంటూ ఆయా వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.***



దాబా గ్రామంలోని శైలజ ఇంటి ఎదుట బంధువులు

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/వాంకిడి, నవంబర్ 25 : వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో గత నెల 30న ఫుడ్ పాయిజన్ కాగా, 64 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కొంత మందిని వాంకిడి పీహెచ్‌సీ, ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, మరి కొంత మందిని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లలోని ప్రైవేట్ దవాఖానల్లో చేర్పించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా మారగా, హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. నవంబర్ 5న తొమ్మిదో తరగతి చదువుతున్న శైలజతో పాటు ఎనిమిదో తరగతి విద్యార్థిని మహాలక్ష్మిని, ఏడో తరగతి విద్యార్థిని జ్యోతిని నిమ్స్‌లో చేర్పించారు. వీరిలో మహాలక్ష్మి, జ్యోతి కోలుకోవడంతో ఈ నెల 14న డిశ్చార్జి చేశారు. కానీ.. శైలజ ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. మొదట శైలజ కోలుకుందని చెప్పిన వైద్యులు ఆమెను జనరల్ వార్డుకు తరలించారు. మరుసటి రోజు మళ్లీ విషమించడంతో తిరిగి వెంటలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. వైద్యానికి ఆమె ఆరోగ్యం సహకరించ లేదు. మూడు రోజులుగా కృత్రిమ శ్వాసపై ఉంచి వైద్యం అందించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే కోవ లక్ష్మి దవాఖానకు వెళ్లి శైలజను పరామర్శించారు. మంత్రులు సీతక్క, దామోదర్ రాజనర్సింహ సైతం పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. కానీ ఫలితం లేకుండా పోయింది. 20 రోజులుగా మృత్యువుతో పోరాడిన శైలజ సోమవారం తుది శ్వాస విడిచింది.

### 20 రోజులుగా దవాఖానలోనే..

కూతురు శైలజ దుస్థితిని చూసి ఆమె తల్లిదండ్రులు చౌదరి తుకారం, మీరాబాయి ఆందోళన చెందుతూ వచ్చారు. 20 రోజులుగా కంటిమీద కునుకులేకుండా కూతురుతో పాటు దవాఖానలోనే ఉన్నారు. వాంకిడి మండలం దాబా గ్రామానికి చెందిన తుకారం దంపతులది వ్యవసాయ కుటుంబం. తమకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ తన ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. శైలజ వాంకిడిలోని ఆశ్రమ పాఠశాలలో 9 వ తరగతి, కుమారుడు వాంకిడి జడ్పీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. కూతురు శైలజ చదువులో చురుకుగా ఉండేదని, ఉన్నత చదువులు చదివి తమకు అండగా నిలుస్తుందని తల్లిదండ్రులు ఎంతో ఆశపడ్డారు. ప్రాణాలతో తిరిగి వస్తుందనుకున్న బిడ్డ చివరికి మృత్యువాత పడడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


### అధికారుల నిర్లక్ష్యమే..

ఆశ్రమ విద్యార్థిని శైలజ ఆరోగ్యంపై అధికారులు ముందు నుంచి సరైన శ్రద్ధతీసుకొని ఉంటే ఇలా జరిగేది కాదని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, విద్యార్థినులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం వల్లే బాలిక చనిపోయిందని వారు మండిపడుతున్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, 11 నెలల కాంగ్రెస్ పాలనలో ఆశ్రమాల్లో మృత్యుఘోష వినిపిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తుండగా, కలకలం రేపుతున్నది.

# ఒక్కటా.. రెండా!

## ట్రాకర్లకు తెలియని పులుల జాడ

- అసలు ఎన్ని ఉన్నాయో స్పష్టత కరువు
- కోర్‌దోబ్రా అటవీ ప్రాంతంలో పశువుల మందపై దాడి చేయడంతో వణికిపోతున్న ప్రజలు
- ఆ ప్రాంతంలో నాలుగు కెమెరాల ఏర్పాటు
- ఘటనలు జరిగినప్పుడే హడావుడి చేసి వదిలేస్తున్న అధికారులు



గాదిగూడ మండలం ఝరి నుంచి తిరిగి వెళ్లిపోతున్న పెద్దపులి జానీ

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఆసిఫాబాద్ డివిజన్‌లోని వాంకిడి, కెరమెరి, జైనూర్, తిర్యాణి అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్న పులి ఒక్కటేనా.. లేక రెండా.. అన్న అంశంపై అధికారులు స్పష్టతకు రాలేకపోతున్నారు. ఇటీవల జైనూర్ మండలం పానపటార్‌లోని అటవీ సమీపంలోగల వ్యవసాయ క్షేత్రాల్లో రైతులకు ఓ పులి కనిపించింది. వారం క్రితం జైనూర్‌లో ఓ ఆవుపై దాడి చేసింది. ఆ తర్వాత ఉట్నూర్‌లోని చాందూరి, ఎక్స్‌రోడ్ ప్రాంతంలో పులి సంచారం కనిపించింది. కెరమెరిలోని జోడేఘాట్ ప్రాంతంలోనూ పులి సంచరించినట్లు అటవీ అధికారులు గుర్తించి ప్రజలను అప్రమత్తం చేశారు. దీనిని బట్టి ఏజెన్సీలో అడవుల్లో సంచరిస్తున్నది ఒక్కటా.. లేక రెండు పులులా అనేది తెలియడం లేదు. అధికారులు ట్రాకర్స్ సాయంతో గుర్తిస్తేనే స్పష్టమవుతుంది. ఆదివారం వాంకిడి మండలం డాబా– కోర్ డోబ్రా అటవీ ప్రాంతంలో పశువుల మందపై పులి దాడి చేసిన ఘటనతో బండకస, దాబా, సవాతి, అంతపూర్, గోండగ్రాం గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఎప్పుడు ఏ వైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని గజ గజ వణికిపోతున్నారు.

### గోయగాం అటవీ ప్రాంతంలో పులి

వాంకిడి,నవంబర్ 25 : మండలంలోని సరిహద్దు గ్రామమైన గోయగాం అటవీ ప్రాంతంలో సోమవారం సాయంత్రం పులి కనిపించింది. రోడ్డుపై ప్రయాణిస్తున్న కొందరు యువకులు సెల్‌ఫోన్‌లలో వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు. స్థానిక అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ట్రాకింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఆదివారం దాబా అటవీ ప్రాంతంలో పశువుల మందపై దాడి చేసిన పెద్దపులే ఈ ప్రాంతంలోకి వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు.


### ట్రాకర్లకు తెలియని జాడ...

పులి మహారాష్ట్ర వెళ్లిపోయిందని ప్రకటించిన రెండు రోజులకే వాంకిడి మండలంలోని కోర్‌డోబ్రా అటవీ ప్రాంతంలో పశువుల మందపై పంజా విసిరి ఐదు పశువులను గాయపరచడం కలకలం రేపుతున్నది. ఈ ఘటనతో అప్రమత్తమైన అటవీ అధికారులు, ట్రాకర్లు సోమవారం పులి దాడిచేసిన ప్రదేశాన్ని సందర్శించారు. పులి ఎటువెళ్లిందనేది గుర్తించలేకపోయారు. ఈ ప్రాంతం పూర్తిగా మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉంటుంది. అది మహారాష్ట్ర అడవుల్లోకి వెళ్లిపోయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే పులిదాడి ఘటనలు జరిగినప్పుడే అధికారులు హడావుడి చేసి.. ఆపై పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### మహారాష్ట్ర వెళ్లిపోయి ఉండవచ్చు..

**- సరోజ, డిప్యూటీ రేంజర్**

వాంకిడిలో కోర్ డోబ్రా అటవీ ప్రాంతంలో పశువులపై డాడి చేసిన పులి మహారాష్ట్ర వెళ్లిపోయి ఉండవచ్చు. ఘటన జరిగిన అటవీ ప్రాంతాన్ని ట్రాకర్స్‌తో వెళ్లి పరిశీలించాం. పులి సంచారాన్ని గుర్తించేందుకు నాలుగు కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.



పులి జాడ కోసం అడవిలో గాలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

తిర్యాణిలో చలిమంట కాగుతున్న గ్రామస్తులు



# గజ గజ

- గణనీయంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 8.3 డిగ్రీలు

*ఆదిలాబాద్, నవంబర్ 25(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చలితీవ్రత పెరిగింది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్(యూ) మండలంలో రాష్ట్రంలోనే అతితక్కువ ఉష్ణోగ్రత 8.3 డిగ్రీలు నమోదైంది. ఆదిలాబాద్ జిల్లాలో 9.9 డిగ్రీలు, నిర్మల్‌లో 10.9 డిగ్రీలు, మంచిర్యాలలో 11.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో చలితీవ్రత అధికంగా ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన చలి ఉదయం 9 గంటల వరకు ఉంటుంది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో చలి ప్రభావం అధికంగా ఉంటున్నది.*

# అంకిత భావంతో పనిచేయాలి

## బెటాలియన్స్ డీఐజీ సిద్ధిఖీ

హాజీపూర్, నవంబర్ 25 : ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని బెటాలియన్స్ డీఐజీ షర్ఫొద్దీన్ సిద్ధిఖీ పేర్కొన్నారు. సోమవారం గుడిపేటలోని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌ను సోమవారం తనిఖీ చేశారు. డీఐజీకి బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు స్వాగతం పలికి పూల బొకే అందజేశారు. అనంతరం పోలీసులతో గౌరవ వందనం స్వీకరించారు. వార్షిక తనిఖీలో భాగంగా బెటాలియన్‌లోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీ అనంతరం బెటాలియన్ ప్రధాన కార్యాలయం ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న డీఐజీ సిద్ధిఖీ